

వర్ధన్నపేటకు మళ్లీ జీవం

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక - 261 శుక్రవారం09 జనవరి 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -6 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## జనగణనకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

**కేంద్ర హోంశాఖ నోటిఫికేషన్ విడుదల**

**ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30వరకు ప్రక్రియ**



న్యూఢిల్లీ**జనవరి8(జర్నలిస్ట్ వార్త):**
దేశవ్యాప్తంగా జనగణనకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జనగణన తొలి దశగా ఇళ్ల గణన ప్రక్రియను చేపట్టనున్నారు. ఈ మేరకు కేంద్ర హోం శాఖ గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమై.. సెప్టెంబర్ 30వ తేదీతో ఈ ప్రక్రియ ముగియనుంది. దేశంలోని ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతంలో కనీసం 30 రోజులపాటు ఈ ప్రక్రియను నిర్వహించనుంది. హౌస్ లిస్టింగ్‌లో భాగంగామిగతా 2లో...



# ఉపాధి పథకం రద్దు దుర్మార్గ చర్య

**పేదల పొట్టకొట్టే యత్నం చేసిన మోడీ**

**అధికారం ఉందని మోడీ ఇష్టారీతి నిర్ణయాలు**

**ఉపాధితో పేదరిక నిర్మూలనకు అడుగులు**

**పంచాయితీ ఎన్నికల మాదిరే మున్సిపల్ ఎన్నికలకు సిద్ధం**

**కార్యకర్తలకు సిఎం రేవంత్ రెడ్డి పిలుపు**



హైదరాబాద్,**జనవరి8(జర్నలిస్ట్ వార్త):**
పేదలపై కక్షతో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్నే మారుస్తారా అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. నిబంధనల మార్పు ముసుగులో పథకాన్ని శాశ్వతంగా సమాధి చేయడానికి కుట్ర చేస్తున్నారన్నారు. గాంధీభవన్‌లో నిర్వహించిన పీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. అధికారం ఉందని మోదీ ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరిస్తామంటే అంగీకరించం అని అన్నారు. మెజారిటీ ఉందని చట్టసభలను వినియోగించి పేదలను అణచివేస్తామంటే కుదరదు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రను అడ్డుకోవాల్సిన సమయమిదని అన్నారుమిగతా 2లో...

## ఎపి ప్రయోజనాలు బాబు తాకట్టు



- రాయలసీమకు ద్రోహం చేస్తున్న చంద్రబాబు
- సీమ ఎత్తిపోతలపై దుష్ప్రచారం వెనక కుట్ర
- తెలంగాణకు దాసోహమన్న సిఎం చంద్రబాబు
- రేవంత్ రెడ్డితో బాబు రహస్య ఒప్పందం
- ఎస్ఎల్‌బిసితో 45 టీఎంసీలు తరలించేలా పనులు
- మీడియా సమావేశంలో జగన్ ఘాటు విమర్శలు

అమరావతి,**జనవరి8(జర్నలిస్ట్ వార్త):**
రాయలసీమ ఎత్తిపోతలపై కూటమి ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తోందని మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కరువు కోరల్లో చిక్కుకున్న ప్రాంతానికి నీళ్లు ఇవ్వాలనుకున్నామని అన్నారు. రాయలసీమకు తాము తలపెట్టిన ఎత్తిపోతల.. సంజీవని లాంటిదని చెప్పుకొచ్చారు. నెల్లూరు, రాయలసీమ ప్రజలు చంద్రబాబును విలన్‌లా చూస్తున్నారని ఆరోపించారు. సీఎం సీట్లో కూర్చుని చంద్రబాబు ఏపీ ప్రయోజనాలను తాకట్టుపెట్టారని విమర్శించారు. మిగతా 2లో...

## భారత్‌పై పేలనున్న మరో బాంబ్

**ఏకంగా 500 శాతం సుంకాల విధింపునకు రెడీ**

**బిల్లును సిద్ధం చేసిన అమెరికా**




వాషింగ్టన్,**జనవరి: 8:**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై మరో బాంబు వేసేందుకు రెడీ అవుతున్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందనే కారణంతో భారత్‌పై ఏకంగా 500 శాతం సుంకాలు విధించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. ఈ మేరకు కీలక బిల్లుకు ట్రంప్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ విషయంపై రిపబ్లికన్ సెనెటర్ లిన్స్ గ్రాహంమిగతా 2లో...

## పరకామణి కేసులో చట్టప్రకారం ముందుకెళ్ళండి

**సుప్రీం ఆదేశాలను పరిగణనలోకి తీసుకోవాలి**

**బాధ్యులైన అధికారుపై శాఖాపరమైన చర్యలు**

**ఏసీబీ డీజీ, సీఐడీకి ఏపీ హైకోర్టు ఆదేశం**



అమరావతి,**జనవరి8(జర్నలిస్ట్ వార్త):**
పరకామణి కేసులో సుప్రీంకోర్టు ఆదేశాలను పరిగణనలోకి తీసుకుని.. చట్టప్రకారం ముందుకెళ్లాలని ఏసీబీ డీజీ, సీఐడీకి ఏపీ హైకోర్టు ఆదేశించింది.మిగతా 2లో...

## హెచ్‌టి పత్తి విత్తనాలను అడ్డుకోండి

**రాష్ట్రంలోకి రాకుండా చర్యలు తీసుకోండి**

**టాస్క్ ఫోర్స్ టీమ్‌లతో నిఘా ఏర్పాటు**

**అధికారులకు మంత్రి తుమ్మల దిశానిర్దేశం**



హైదరాబాద్,**జనవరి8(జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్రంలో అనధికారకంగా, అనుమతిలేని పత్తి విత్తనాల ప్యాకెట్ల అమ్మకాలను అరికట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. పత్తి విత్తనాల ప్యాకేట్లపై వ్యవసాయశాఖ సంచాలకులతో సచివాలయంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు.మిగతా 2లో...

## ఏపీలో నిలిచిపోనున్న ఆర్టీసీ అద్దె బస్సులు..

**సమ్మెకు యజమానుల పిలుపు**

**ఈ నెల 12 నుంచి బస్సులు నిలిపివేయాలని నిర్ణయం**

**అద్దె పెంచాలంటూ యజమానుల సంఘాల డిమాండ్**




ఏపీఎస్ ఆర్టీసీలో సమ్మె వాతావరణం నెలకొంది. అద్దె బస్సుల యజమానులు సమ్మె సైరన్ మోగించారు. తమకు చెల్లించే అద్దెను పెంచాలని డిమాండ్ చేస్తూ, ఈ నెల 12వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా బస్సులను నిలిపివేయనున్నట్లు హెచ్చరించారు.
మిగతా 2లో...

## కృష్ణా జలాల అంశంలో ప్రజలను కేసీఆర్ పదేపదే మోసం చేశారు

**వాటికి అడ్డు చెప్పవద్దని ఏపీ పునర్విభజన చట్టంలో ఉంది: బండి సంజయ్**

**పోతిరెడ్డిపాడు ద్వారా 4 టీఎంసీల నీటిని ఏపీకి తరలించారన్న బండి సంజయ్**



హైదరాబాద్,**జనవరి8(జర్నలిస్ట్ వార్త):**
ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో అప్పటికే నిర్మాణంలో ఉన్న నీటి ప్రాజెక్టులకు అభ్యంతరం చెప్పకూడదని ఉందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు.మిగతా 2లో...

## మహిళా మంత్రులకు కెసిఆర్ ఆత్మీయ స్వాగతం

**చీరసారెతో దంపతుల సత్కారం**

**యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న కెసిఆర్**

**మేడారం ఆహ్వాన పత్రికి అందచేసిన మంత్రులు**



## మంత్రుల తీరుపై మరోమారు అసహనం

**జల రవాణా పెంచుకునే దిశగా కార్యాచరణ**

**లాజిస్టిక్స్ వినియోగంలో ప్రపంచ స్థాయిలో పోటీ**

**పర్యాటక రంగం గేమ్ చేంజర్ కానుంది**

**కేబినేట్ సమావేశంలో సిఎం చంద్రబాబు వెల్లడి**

**మంత్రుల తీరుపై మరోమారు అసహనం**



అమరావతి,**జనవరి8(జర్నలిస్ట్ వార్త):**
జల రవాణా పెంచుకునే దిశగా కార్యాచరణ రూపొందించాలని సిఎం చంద్రబాబు తెలిపారు. లాజిస్టిక్స్ వినియోగంలో ప్రపంచ స్థాయిలో పోటీ పడాలన్నారు. జల రవాణా మెరుగుపర్చుకుంటే అభివృద్ధి పథంలో ముందుంటామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. రెండున్నర గంటలపాటు జరిగిన సమావేశంలో కీలక అంశాలపై మంత్రివర్గం చర్చించింది.మిగతా 2లో...

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక..



## కృష్ణా జలాల అంశంలో ప్రజలను కేసీఆర్ పదేపదే మోసం చేశారు

(మొదటి పేజి తరువాయి)

నీటి పంపకాల విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య జరుగుతున్న వాగ్యుద్ధం నేపథ్యంలో ఆయన ఈరోజు మీడియాతో మాట్లాడుతూ, కృష్ణా జలాల్లో తెలంగాణకు 571 టీఎంసీలు రావాల్సి ఉండగా, కేవలం 299 టీఎంసీలకు మాత్రమే అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎందుకు అంగీకారించారని ప్రశ్నించారు. కృష్ణా జలాల విషయంలో కేసీఆర్ ప్రజలను పదేపదే మోసం చేశారని ఆయన ఆరోపించారు. పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తరలించినప్పుడు ఎవరూ స్పందించలేదని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి నదీ జలాల అంశాన్ని తెరపైకి తెచ్చాయని ఆయన అన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణ తన వాటాను పూర్తిగా వాడుకోలేదని, అవసరం ఉన్నప్పటికీ వినియోగించుకోలేదని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర విభజన సమయంలో అప్పటికే నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు అభ్యంతరం చెప్పవద్దని ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో స్పష్టంగా ఉందని, అయితే ఆ చట్టంలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించిన ప్రస్తావన లేదని ఆయన అన్నారు. పోతిరెడ్డిపాడు ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు 4 టీఎంసీల నీటిని తరలించారని, దీనిని తెలంగాణ కాంగ్రెస్ గానీ, బీఆర్ఎస్ గానీ గతంలో పట్టించుకోలేదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ చేసిన తప్పిదాలు చూస్తే తనకు ఆశ్చర్యం కలుగుతోందని ఆయన అన్నారు.

## పరకామణి కేసులో చట్టప్రకారం ముందుకెళ్ళండి

(మొదటి పేజి తరువాయి)

అలాగే బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని టీటీడీ, పోలీసు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులకు హైకోర్టు స్పష్టం చేసింది. టీటీడీ పరకామణి కేసు విచారణ సందర్భంగా గురువారం నాడు ఏపీ హైకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. అలాగే నిందితుడు రవికుమార్‌తో కుమ్మక్కై పరకామణి కేసును.. టీటీడీ, పోలీసులు బలహీన పరిచారని పేర్కొంది. నిందితుడు రవికుమార్‌తోపాటు అతడి కుటుంబ సభ్యులకు ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయని.. సీఐడీ, ఏసీబీ నివేదికలు పరిశీలిస్తే స్పష్టమవుతుందని తెలిపింది. నిందితుడు రవికుమార్ ఆస్తులు స్వీకరించే క్రమంలో టీటీడీ అధికారులు, బోర్డు సభ్యులు, పోలీసులు చట్ట ప్రకారం నిబంధనలను అనుసరించలేదని ఏపీ హైకోర్టు వెల్లడించింది. ఇక మాజీ ఏవీఎస్‌వో సతీష్ కుమార్ మృతిపై దర్యాప్తు వేగవంతం చేయాలని సీఐడీని ఆదేశించింది. కేసు తీవ్రత దృష్ట్యా చార్జ్‌షీట్ దాఖలు వరకూ దర్యాప్తును పర్యవేక్షిస్తామని స్పష్టం చేసింది. పరకామణిలో సంస్కరణలపై టీటీడీ సమర్పించిన నివేదికపై హైకోర్టు ఒకింత అసంతృప్తి వ్యక్తం చేసింది. దేవుడికి సమర్పించిన కానుకల లెక్కింపు విధానం మెరుగు పరిచేందుకు.. అత్యుత్తమ ఆలోచనలతో రావాలని టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్‌కు హైకోర్టు స్పష్టంగా ఆదేశించింది. తిరుమల శ్రీవారి పరకామణిలో చేపట్టాల్సిన సంస్కరణలపై నివేదికను ఇటీవల ఏపీ హైకోర్టుకు టీటీడీ సమర్పించింది. ఈ నివేదికను పరిశీలించిన ఉత్తర్వులు జారీ చేస్తామని ఏపీ హైకోర్టు స్పష్టం చేసింది. పరకామణిలో వెంటనే చేపట్టాల్సిన సంస్కరణలపై ఏపీ హైకోర్టుకు టీటీడీ సోమవారం అంటే.. జనవరి 5వ తేదీన నివేదిక అందజేసింది. ఈ నివేదికను పరిశీలించిన ఏపీ హైకోర్టు గురువారంపై విధంగా స్పందించింది

## జనగణనకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజి తరువాయి)

అన్ని రకాల ఇళ్లు, నివాసాలు, భవనాలు, నిర్మాణాల వివరాలను సేకరించనున్నారు. దేశంలో ప్రతి పదేళ్లకు ఒకసారి జనగణన నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. 2021లో ఈ జనగణన ప్రక్రియను నిర్వహించాల్సి ఉంది. కానీ కొవిడ్ కారణంగా.. ఈ ప్రక్రియను వాయిదా వేశారు. తాజాగా ఈ జనన గణన ప్రక్రియను నిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది. అయితే ఈ ప్రక్రియను రెండు దశల్లో నిర్వహించేందుకు కేంద్రం ఏర్పాట్లు చేస్తోంది. తొలి దశలో ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు జరగనుంది. ఇక రెండో దశలో జనాభా లెక్కల సేకరణ వచ్చే ఏడాది అంటే.. 2027 ఫిబ్రవరి నుంచి మార్చి 1వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ జనాభా లెక్కలు పూర్తిగా డిజిటల్ రూపంలో చేయనుంది. ఈ జనగణనతోపాటే కులగణనను సైతం చేపట్టాలని ఇప్పటికే కేంద్రం నిర్ణయించింది. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్రంలో కులగణన ప్రక్రియను చేపట్టి.. పూర్తి చేసింది. దీనిని ఆధారంగా చేసుకుని.. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కులగణన చేపడుతుందంటూ మోదీ ప్రభుత్వంపై ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ విమర్శలు సంధిస్తున్న సంగతి తెలిసిందే.

## భారత్‌పై పేలనున్న మరో బాంబ్

(మొదటి పేజి తరువాయి)

ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. ట్రంప్‌తో జరిగిన భేటీలో పలు కీలక విషయాల గురించి చర్చలు జరిపినట్టు తెలిపారు. రష్యాపై ఆంక్షలు విధించే బిల్లుకు అధ్యక్షుడు ట్రంప్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, ఈ బిల్లుపై వచ్చే వారం ఓటింగ్ జరగనుందని వెల్లడించారు. ఉక్రెయిన్‌లో పుతిన్ చేస్తున్న దారుణాలకు రష్యా నుంచి చమురు కొనడం ద్వారా భారత్, చైనా, బ్రెజిల్ దేశాలు పరోక్షంగా మద్దతు ఇస్తున్నాయని గ్రాహం ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజా బిల్లు ప్రకారం ఆయా దేశాలపై 500 శాతం సుంకాలు విధించే అధికారం అమెరికాకు ఉంటుందని గ్రాహం తెలిపారు బిల్లు ఆమోదం పొందితే రష్యా నుంచి ఇతర దేశాలు చమురు కొనడం తగ్గుతుందని లిన్స్ గ్రాహం ఆశాభావం వ్యక్తం చేశారు. రష్యా నుంచి చమురు కొంటున్న దేశాల్లో ప్రస్తుతం చైనా మొదటి స్థానంలోనూ, భారత్ రెండో స్థానంలోనూ ఉన్నాయి. రష్యా నుంచి చమురు కొనడాన్ని ఆపించడానికి ట్రంప్ ఎన్నో ప్రయత్నాలు చేశారు. అందులో భాగంగానే భారత ఉత్పత్తులపై 50 శాతం సంకాలు విధించారు. అయినా భారత్ మాత్రం రష్యా నుంచి చవకగా వస్తున్న చమురును కొనుగోలు చేస్తూనే ఉంది. అందుకే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రష్యాపై బెదిరింపులకు దిగారు. రష్యా వాణిజ్య భాగస్వామ్య దేశాలపై టారిఫ్‌లను విధించేందుకు సిద్ధమయ్యారు. గతంలో ఈ బిల్లులో కొన్ని సవరణలు చేపట్టాలని వైట్‌హౌస్ సూచించింది.

## ఏపీలో నిలిచిపోనున్న ఆర్టీసీ అద్దె బస్సులు..

(మొదటి పేజి తరువాయి)

ఈ మేరకు గురువారం ఆర్టీసీ యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. స్త్రీశక్తి పథకం అమలు తర్వాత బస్సుల్లో రద్దీ విపరీతంగా పెరిగిందని, దీనివల్ల తమపై అదనపు భారం పడుతోందని యజమానులు చెబుతున్నారు. మరోవైపు పెరిగిన ఇంధన, నిర్వహణ ఖర్చులతో నష్టాలు వస్తున్నాయని, ఈ పరిస్థితుల్లో అద్దె పెంచడం తప్పనిసరి అని వారు వాదిస్తున్నారు. ఈ విషయంపై ఆర్టీసీ యాజమాన్యంతో చర్చలు జరిపినా ఫలితం లేకపోయింది. యాజమాన్యం నెలకు అదనంగా రూ. 5,200 ఇచ్చేందుకు ముందుకొచ్చినా, ఈ పెంపు చాలా స్వల్పమని యజమానుల సంఘాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి. తమతో చర్చించి అద్దెను మరింత పెంచాలని కోరుతూ సమ్మెకు దిగుతున్నట్లు స్పష్టం చేశాయి.

## మహిళా మంత్రులకు కెసిఆర్ ఆత్మీయ స్వాగతం



గజ్వేల్,జనవరి 8: **జనవరి8(జర్నలిస్ట్ వార్త):** ఎర్రవెల్లిలోని తన నివాసానికి వచ్చిన మహిళా మంత్రులను భారత రాష్ట్రసమితి అధినేత కేసీఆర్ ఆత్మీయంగా పలకరించారు. అతిథి మర్యాదలతో పసుపు, కుంకుమ, చీర, తాంబూలాలతో సత్కరించారు. తెలంగాణ రాష్ట్ర మంత్రులు సీతక్క, కొండా సురేఖ గురువారం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి.. మేడారం జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు. మేడారం ప్రసాదం అందజేసి.. మరి కొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న జాతరను సందర్శించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా.. తన ఇంటికి వచ్చిన ఆడబిడ్డలను ఆత్మీయంగా పలకరించి.. సాదరంగా ఆహ్వానించిన కేసీఆర్ దంపతులు సాంప్రదాయ పద్ధతిలో సత్కరించారు. కేసీఆర్ దంపతులు ఇచ్చిన తేనీటి విందు స్వీకరించిన మంత్రులు.. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తొలుత, ఎర్రవెల్లి నివాసానికి చేరుకున్న మహిళా మంత్రులకు మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ ఆహ్వానం పలికారు. తన ఇంటికి వచ్చిన రాష్ట్ర మహిళా మంత్రులను 'బాగున్నరా అమ్మ' అంటూ ఆత్మీయంగా పలకరించారు. వారికి సాదర స్వాగతం పలికారు. కేసీఆర్, ఆయన సతీమణి శోభమ్మ వారికి అతిథి మర్యాదలు చేశారు. సంప్రదాయం ప్రకారం పసుపు కుంకుమలు, చీర, తాంబూలాలతో ఆ ఆడబిడ్డలను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి ఆహ్వాన పత్రికను అందజేశారు. అదేవిధంగా మేడారం ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ దంపతులు అందించిన తేనీటి విందును మహిళా మంత్రులు స్వీకరించారు. కాసేపు పరస్పర యోగక్షేమాల గురించి వారు మాట్లాడుకున్నారు. ఇష్టాగోష్టి అనంతరం మహిళా మంత్రులు తిరుగు ప్రయాణం అయ్యారు. అంతకుముందు మహిళా మంత్రులు ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసం దగ్గర వాహనాలు దిగగానే మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ వారికి పుష్పగుచ్ఛాలు అందించి సాదరంగా ఆహ్వానించారు.

# ఎపి ప్రయోజనాలు బాబు తాకట్టు

(మొదటి పేజి తరువాయి)

గురువారం తాడేపల్లి ప్యాలెస్‌లో జగన్ మోహన్ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. 'సొంత రాష్ట్రాన్ని తన స్వార్థ ప్రయోజనాలకు తాకట్టుపెట్టారు. రాయలసీమ ఎత్తిపోతలపై రేవంత్ వ్యాఖ్యలే సాక్ష్యం. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో చంద్రబాబు రహస్య ఒప్పందానికి అధికార ముద్ర వేశారు. రాయలసీమ లిఫ్ట్ అవసరం లేదని మంత్రులు మాట్లాడుతున్నారు. రాయలసీమ లిఫ్ట్ వెనుక గొప్ప ఉద్దేశ్యం ఉంది. రాయలసీమ ఎత్తిపోతల ఆపమని కోరినట్లు సీఎం రేవంత్ ప్రకటించారు. రేవంత్ వ్యాఖ్యలు చూస్తే చంద్రబాబు ఏపీని అమ్మకానికి పెట్టారని చెప్పడానికి నిదర్శనం. శ్రీశైలంలో 881 అడుగులు ఉంటేనే పోతిరెడ్డిపాడుకు నీళ్లు వస్తాయి.. పోతిరెడ్డిపాడు నుంచి 101 టీఎంసీల కేటాయింపులు ఉన్నాయి. ఇరవై ఏళ్లలో మూడు, నాలుగుసార్లే అన్ని నీళ్లు తెచ్చుకోగలిగాం' అని అని వైఎస్ జగన్ తెలిపారు. 800 అడుగుల్లోపే 2 టీఎంసీల నీళ్లు తీసుకునేందుకు.. తెలంగాణలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు చేపట్టారు. ఎస్ఎల్‌బిసితో 45 టీఎంసీలు తరలించేలా పనులు జరుగుతున్నాయి. 777 అడుగుల నుంచే లెఫ్ట్ పవర్‌హౌస్ ద్వారా..4 టీఎంసీల నీళ్లు తెలంగాణ ఖాళీ చేస్తున్న పరిస్థితి. మనకు నీళ్లు లేకుండా ఇబ్బందులు పడుతున్నాం. తెలంగాణలో పవర్‌హౌస్ ద్వారా ఇష్టారీతిన నీళ్లు తీసుకుంటున్నారు. తెలంగాణలో లిఫ్ట్‌లు, పవర్‌హౌస్‌తో రోజుకు 8 టీఎంసీలు తీసుకుంటున్నారు. శ్రీశైలం, సాగర్, పులిచింతల పవర్‌హౌస్‌లు తెలంగాణెళి ఆపరేట్ చేస్తోంది. ఓటుకు నోటు కేసులో ఆడియో, వీడియోలతో అడ్డంగా దొరికారు. అందుకే చంద్రబాబు నోరు మెదపలేని పరిస్థితి ఉందని జగన్ ఎద్దేవా చేశారు. మేం వచ్చే నాటికే తెలంగాణలో లిఫ్ట్‌ల పనులు జోరుగా సాగుతున్నాయి. తెలంగాణ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు లేవని వైఎస్ జగన్ పేర్కొన్నారు.

చంద్రబాబు దగ్గరుండి రాయలసీమ లిఫ్ట్ ను ఖూనీ చేశారన్నారు. చంద్రబాబు, ఆయన మంత్రి కలిసి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ అక్కర్లేదని మాట్లాడుతున్నారని ఆగ్రహించారు. స్టెబిలైజింగ్ రిజర్వాయర్లు కట్టకపోతే కుప్పానికే కాదు చిత్తూరు జిల్లాకు తాగునీళ్లు ఉండవని జగన్ తెలిపారు. విద్యుత్ ఛార్జీలు పెంచను అని చెప్పిన చంద్రబాబు.. ఇప్పుడు బాదుడే బాదుడుతో ప్రజలపై మోయలేని భారం మోపుతున్నారని తెలిపారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చి రెండు ఏళ్ళు గడవక ముందే రాష్ట్రం రూ. 3 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసారని తెలిపారు. సంపద సృష్టిస్తానని చెప్పి రాష్ట్రాన్ని అప్పుల దిశగా నడిపిస్తున్న చంద్రబాబు ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీయాలని కోరారు. మెడికల్ కాలేజీల కోసం ప్రభుత్వం ఖర్చు చేస్తుంది.. కానీ లాభాలు మాత్రం ప్రైవేటు వాళ్లకే. ఇది స్కాం కాక మరేమిటని ప్రశ్నించారు. చంద్రబాబు స్కాంలకు కాదేది అనర్హమని అన్నారు. ఇసుక.. లిక్కర్.. ఆఖరికి రేషన్ బియ్యంలోనూ స్కాంలేనని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను 19 నెలల్లోనే స్కామాంధ్రప్రదేశ్‌గా మార్చేశారని తెలిపారు. ప్రజల నుంచి దోచుకోవడానికి దొడ్డిదారులు వెతుకుతున్నారని, చార్జీలు, టోల్‌లు, సెస్‌ల పేరుతో ఇష్టమొచ్చినట్లు జనాలపై ఆర్థిక భారం మోపుతున్నారని తెలిపారు. బాదుడుతో సంపద సృష్టిస్తున్నారా అని ప్రశ్నించారు. గతంలో రాయలసీమలో ఉన్న ఏ ప్రాజెక్టునూ పూర్తిగా వాడుకోలేని పరిస్థితులు ఉండేవని, 40ఏళ్ల అనుభవం అని చెప్పుకునే చంద్రబాబు రాయలసీమలో ఉన్న ప్రాజెక్టులకు పూర్తి స్థాయిలో నీళ్లు నింపలేకపోయారని తెలిపారు. ఎన్జీటి అభ్యంతరాల తర్వాత కేంద్రం నుంచి ఎక్స్పర్ట్ అప్రైజల్ కమిటీ మూడుసార్లు సమావేశమైతే రాష్ట్రం తరఫున చంద్రబాబు కనీసం నోరు మెదపలేదని జగన్ తెలిపారు.

## నదీగర్భంలో రాజధాని ఎలా నిర్మిస్తారు

**అమరావతిపై మరోమారు జగన్ సంచలన వ్యాఖ్యలు**

అమరావతి,జనవరి8(ఆర్ఎన్ఎ):రాజధాని అమరావతిపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరోమారు సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంట్‌లో బిల్లు పెడుతున్న సమయంలో వైఎస్ జగన్ ఈ వ్యాఖ్యలలు చేయడం గమనార్హం. గురువారం తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలోజగన్ విలేకర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా నదీగర్భంగా రాజధాని అమరావతి నిర్మాణం చేపడుతున్నారని జగన్ ఆరోపించారు. దీనిని సుప్రీంకోర్టు పరిగణలోకి తీసుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు. రాజధాని అనే పదమే లేదని.. సీఎం ఎక్కడ కూర్చొంటే అదే రాజధాని అంటు ఆయన పునరుద్ఘాటించారు. నదీ గర్భంలో భవన నిర్మాణాలకి అనుమతులివ్వరని.. అలాంటిచోట రాజధాని నిర్మాణం చేపడుతున్నారంటూ సీఎం చంద్రబాబుపై పరోక్షంగా వ్యాఖ్యానించారు. రహదారులు, నీరు, విద్యుత్ సరఫరా లేని ప్రాంతంలో రాజధాని నిర్మాణం అంటూ వైఎస్ జగన్ వ్యంగ్యంగా అన్నారు. సో కాల్డ్ క్యాపిటల్ అంటూ అమరావతిని ఆయన అభివర్ణించారు. అమరావతి రాజధానిగా ఉండడం వల్ల తమకేమీ అభ్యంతరం లేదని ఇటీవల వైసీపీ అధినేత వైఎస్ జగన్ రాజకీయ కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత తాజాగా వైఎస్ జగన్ ఈ తరహా వ్యాఖ్యలు చేశారు. ఇకపోతే

# ఉపాధి పథకం రద్దు దుర్మార్గ చర్య

(మొదటి పేజి తరువాయి)

. ఈ పథకంతో ఎన్నో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ఇది ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. 2024 ఎన్నికల్లో 400 సీట్లు ఇవ్వాలని భాజపా నేతలు ప్రచారం చేశారు. అన్ని సీట్లు వచ్చి ఉంటే రాజ్యాంగాన్నే మార్చేసేవారు. తద్వారా పేదల హక్కులను కాలరాయాలని చూశారు. కార్పొరేట్లకు దేశాన్ని అప్పగించే ప్రయత్నం చేశారు. ప్రజలను కాంగ్రెస్ అప్రమత్తం చేయడంతో భాజపా 240 సీట్ల వద్ద ఆగిపోయింది. దీంతో రాజ్యాంగాన్ని మార్చాలనే ఆలోచన వాయిదా పడింది. ఓట్లను తొలగించేందుకు ఎస్ఐఆర్ తీసుకొచ్చారు. దీని వెనుక పెద్ద కుట్ర ఉందని రేవంత్‌రెడ్డి అన్నారు. ఉపాధి హామీ పథకం వల్ల వెట్టిచాకిరి ఆగిపోయిందని, గ్రామాల నుంచి వలసలు తగ్గాయన్నారు. అలాగే పనికితగ్గ వేతనం డిమాండ్ చేసే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. దేశంలో 80 శాతం మంది ఈ ఉపాధి హామీపై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రపన్నుతోందని సీఎం రేవంత్ ఆరోపించారు. పథకం పేరు మార్పు వెనుక ప్రధాని మోదీ కుట్ర ఉందని ఆయన ఆరోపించారు. ఎస్ఐఆర్ వెనుక పెద్ద కుట్ర ఉందని.. వీబీ జీ రామ్ జీ (వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్) చట్టాన్ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేశామన్నారు. ఉపాధి హామీని రద్దు చేస్తే మళ్లీ వలసలు ప్రారంభ మవుతాయని హెచ్చరించారు. కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూర్చేందుకు, అదానీ-అంబానీలకు ప్రజలను కూలీలుగా మార్చేందుకు ఉపాధి హామీని రద్దు చేస్తున్నారని విమర్శించారు. వికసిత్ భారత్ కాదు.. సంక్షోభ భారత్‌ను సృష్టిస్తున్నారని మండిపడ్డారు. నల్ల చట్టాల విషయంలో క్షమాపణ చెప్పే వరకు వదల్లేదని.. ఇప్పుడు ఉపాధి హామీ విషయంలోనూ క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. అధికారం ఉందని మోదీ ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ ఆరోపించారు.

ఈ సమావేశంలో పార్టీ కార్యకర్తల పాత్రను ముఖ్యమంత్రి రేవంత్ కొనియాడారు. కార్యకర్తల కష్టం, త్యాగాలతోనే అధికారంలో ఉన్నామని.. వచ్చిన పదవులన్నీ కార్యకర్తలు ఇచ్చినవేనని చెప్పారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ ఎన్నికల్లో 66 శాతంపైగా కాంగ్రెస్ గెలిచిందని, మున్సిపల్ ఎన్నికల్లోనూ గెలవాలని ధీమా వ్యక్తం చేశారు. కష్టపడినవాడు ఎప్పుడూ నష్టపోడని తెలిపారు. కాంగ్రెస్ మంత్రులంతా కష్టపడి పైకొచ్చినవారేనని, పార్టీ అవకాశం ఇస్తే తనతోపాటు ఎవరికైనా గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు.

# హెచ్‌టీ పత్తి విత్తనాలను అడ్డుకోండి

(మొదటి పేజి తరువాయి)

కేంద్ర ప్రభుత్వ అనుమతిలేని హెచ్‌టీ పత్తి విత్తనాలను రాష్ట్రంలో అమ్మకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పత్తి రకాన్ని అమెరికాకు చెందిన మోన్సాంటో కంపెనీ కనుగొన్నప్పటికి, ఫీల్డ్ ట్రయల్స్ లో ఫెయిల్ అవడం మరియు దీనివలన పర్యావరణానికి కలిగే అనర్థాలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం ఈ పత్తి రకానికి అనుమతులు ఇవ్వలేదని మంత్రిగారు తెలిపారు. అయినప్పటికి కొందరు దళారులు తమ ప్రయోజనాల కోసం రైతులకు ఊ÷ు పత్తి విత్తనాలను అనధికారకంగా రైతులకు అంటగడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 20 అధీకృత పత్తి విత్తన కంపెనీలు విత్తనోత్పత్తి చేస్తుండగా, ప్రభుత్వం సర్టి÷డ్ చేసిన మరో 40 వివిధ కంపెనీలు రాష్ట్రానికి పత్తి విత్తన ప్యాకెట్లను సరఫరా చేస్తున్నాయన్నారు. గత సంవత్సరం ఈ కంపెనీల ద్వారా సరఫరా అయిన 1.10 కోట్ల పత్తి విత్తన ప్యాకెట్లను రైతుల కొనుగోలు చేశారన్నారు. కొందరు దళారులు కేంద్ర ప్రభుత్వం బ్యాన్ చేసిన హెచ్‌టి విత్తనాలతో పాటు కల్తీ విత్తనాలను మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి తెలంగాణ సరిహద్దు ప్రాంతాలలోని రైతులకు అమ్ముతున్నట్టు గుర్తించామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో దాదాపు 52 లక్షల ఎకరాలలో పత్తి సాగయ్యే అవకాశం ఉందని, దీనిని ఆసరా చేసుకొని దళారులు ఊ÷ు విత్తనాలు మరియు కల్తీ విత్తనాలను రాష్ట్రంలోకి తెచ్చే అవకాశం ఉన్నందున, ఈ నెల నుంచే సరిహద్దు ప్రాంతాలలో టాస్క్ ఫోర్స్ టీంలను ఏర్పాటు చేసిన పత్తి విత్తనాల అక్రమ రవాణాలను అరికట్టే విధంగా నిఘా ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అదేవిధంగా కో-మార్కెటింగ్ కు సంబంధించి విధివిధానాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ రకం పత్తి విత్తనాలను రైతులు కొనకుండా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా కలుపును తట్టుకుంటుందని, అధిక దిగుబడి వస్తుందని పత్తి విత్తనాలను కొనవద్దని ఈ సందర్భంగా మంత్రి రైతులను కోరారు. ఈ విత్తనాలను వాడటం వలన అధికంగా కలుపు మందు వాడాల్సి వస్తుందని, దీంతో పర్యావరణానికి హాని కలగడంతోపాటు జీవ వైవిధ్యం దెబ్బతిని, ఇతర పత్తి హైబ్రిడ్ లు కూడా కలుషితం అవుతాయని వివరించారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ సంచాలకులు డా.గోపితో పాటు వ్యవసాయశాఖ అధికారులు మరియు విత్తన కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మంత్రుల తీరుపై మరోమారు అసహనం

(మొదటి పేజి తరువాయి)

క్యాబినేట్‌లో అజెండా అంశాలు ముగిశాక,రాజకీయ, తాజా పరిణామాలపై మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చించారు అన్ని తీర ప్రాంత జిల్లాలో ఒక్కో పోర్టు ఏర్పాటు కావాలి. జగన్ పాలనలో విధించిన ట్రూఅప్ ఛార్జీల భారం ప్రజలపై పడకుండా ప్రభుత్వమే భరిస్తోంది. రూ. 4,490 కోట్ల ట్రూఅప్ ఛార్జీలు ప్రభుత్వమే భరిస్తోంది. యూనిట్ విద్యుత్ ఛార్జీ రూ. 5.19 నుంచి రూ. 4.90కి తగ్గించాం. ఫెర్రో అల్లాయిస్ యూనిట్లు 70 వేల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. ఏడాదిపాటు విద్యుత్ రాయితీలను కల్పిస్తే, తర్వాత అవే ఉత్పత్తి చేసుకుంటాయి. చీరాలలో పర్యాటక రంగాన్ని మరింత ప్రోత్సహించాలి. సూర్యలంకలో కొత్తగా 3 హోటళ్ల ఏర్పాటుకు ఆమోదం తెలిపాం. పర్యాటక రంగం ఓ గేమ్ ఛేంజర్. పర్యాటక రంగంలో అన్ని అవకా శాలను అందిపుచ్చుకోవాలి. బార్లకు, లిక్కర్ షాపులకు తేడా లేకుండా ఏఈఆర్‌టీ ఛార్జీలు సమం చేయాలని చంద్రబాబు అన్నారు. 'సముద్రంలో కలిసే జలాలు తెలుగు రాష్ట్రాలు ఉపయోగించుకుంటే మేలు కదా. నీరు ఊరికే సముద్రం పాలైతే ఎవరికీ ఉపయోగం ఉండదు. నీటి లభ్యత ఉంటే రైతులు కొత్త పంటలు వేసుకోవచ్చు. పోలవరం పూర్తయితే కృష్ణా జలాల్ని విశాఖకు తీసుకెళ్లొచ్చు. జగన్ హయాంలోనే రాయలసీమ లిఫ్ట్ ఆగిపోతే మనపై నిందలు వేస్తున్నారు. అధికారుల సమన్వయంతో ప్రతీ ప్రాజెక్టు గ్రౌండ్ అవ్వాలి. అన్ని రకాల పంటలను కొనుగోలు చేస్తున్నాం. రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు ప్రోత్సహించాలని సీఎం వివరించారు. కేబినెట్ ముగిసిన అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రుల పనితీరు, పార్టీ వ్యవహారాల నిర్వహణపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కేబినెట్ భేటీ తర్వాత పార్టీ కార్యాలయానికి తరచూ తానే రావాల్సి వస్తోందని, అయినా ప్రజల నుంచి వచ్చే వినతులు తగ్గకపోవడం ఆందోళన కలిగిస్తోందని వ్యాఖ్యానించారు. నెలకు రెండు నుంచి మూడు సార్లు నేనే పార్టీ ఆఫీస్‌కు రావాల్సి వస్తోంది. అయినా వినతులు మాత్రం తగ్గడం లేదన్న సీఎం చంద్రబాబు.. ప్రజా సమస్యల పరిష్కారంలో మంత్రులు మరింత చొరవ చూపాలని సూచించారు. పార్టీ కోసం ఐదేళ్ల పాటు కష్టపడ్డ కార్యకర్తల పేర్ల జాబితాను అందించమని పలుమార్లు కోరినా.. ఇప్పటికీ జిల్లాల నుంచి పూర్తి వివరాలు అందలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు సీఎం చంద్రబాబు.. ఎన్నిసార్లు అడిగినా.. పార్టీ కోసం ఐదు సంవత్సరాలు కష్టపడ్డ వారి పేర్లు ఇవ్వడం లేదు. ఈ నిర్లక్ష్యం సరైన పద్ధతి కాదు అంటూ ఆయన అసహనం వ్యక్తం చేశారు. పార్టీ నిర్మాణం, పార్లమెంటు స్థాయి కమిటీల ఏర్పాటులోనూ మంత్రుల నుంచి ఆశించిన స్థాయిలో సహకారం అందలేదని పేర్కొన్న చంద్రబాబు.. పార్లమెంటు స్థాయిలో కమిటీలు కూడా నేనే పూర్తి చేశాను. దీన్ని బట్టి ఆయా జిల్లాల మంత్రుల పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు అని అన్నారు. ప్రజా సమస్యలు, పార్టీ వ్యవహారాలు, కమిటీల ఏర్పాట్లలోనూ తానే ముందుండి పూర్తి చేయాల్సి రావడం చూస్తుంటే.. జిల్లా అధ్యక్షులు, జిల్లా మంత్రుల పనితీరు ఎలా ఉందో ప్రజలు, పార్టీ శ్రేణులు అంచనా వేసుకోవచ్చు అన్నారు సీఎం చంద్రబాబు.. మంత్రులు పార్టీ, ప్రజా సమస్యలపై సమానంగా దృష్టి పెట్టాలని ఆయన స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. పార్టీ శ్రేణుల వినతులు, కార్యకర్తల గుర్తింపు, ప్రజా సమస్యల పరిష్కారంలో మంత్రులు మరింత సమర్థవంతంగా పనిచేయాలని, పార్టీ కోసం పని చేసిన వారికి న్యాయం చేయాలనే బాధ్యతను గుర్తుంచుకోవాలని సీఎం చంద్రబాబు హితవు పలికారు.

# ఎక్కడి చెత్త అక్కడే కాగితాలకే పరిమితం!

## పట్టించుకోని కమిషనర్ - దుర్వాసనలో 25వ వార్డు







**నర్సంపేట/జనవరి8(జర్నలిస్ట్ వార్త):** నర్సంపేట పట్టణంలోని 25వ వార్డు ప్రజలు తీవ్రమైన దుర్వాసనతో నరకయాతన అనుభవిస్తున్నా మున్సిపాలిటీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సైడ్ కాలువలు చెత్తతో నిండిపోవడంతో మురుగు నీరు రోడ్లపైకి చేరి జనజీవనాన్ని అతలాకుతలం చేస్తోంది.

వార్డులోని ప్రధాన రహదారి వెంట ఉన్న సైడ్ కాలువలు నెలల తరబడి శుభ్రం చేయకపోవడంతో మురుగు నీరు నిలిచిపోతోంది. దీంతో పరిసర ప్రాంతమంతా దుర్వాసన వ్యాపించి ప్రజలు ఇంట్లో కూర్చోవడానికే ఇబ్బంది పడుతున్న పరిస్థితి నెలకొంది. చిన్నారులు, వృద్ధులు, రోగులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత మూడు సంవత్సరాలుగా అదే వార్డులో అద్దె భవనంలో ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల కొనసాగుతోంది. ఆ భవనానికి సంబంధించిన సెప్టిక్ ట్యాంక్ నిండిపోవడంతో మురుగు నీరు నేరుగా సైడ్ కాలువల్లోకి వెళ్లుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ కారణంగా పరిసర ప్రాంతాల్లో తీవ్ర దుర్వాసనతో పాటు దోమల బెడద కూడా పెరిగిందని వాపోతున్నారు.

ఈ మార్గం గుండా కళాశాల విద్యార్థులు, బ్యాంకు ఉద్యోగులు, అధ్యాపకులు, వ్యాపారులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. దుర్వాసన భరించలేక ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహిళలు, విద్యార్థినులు ఇబ్బందులతో అవస్థలు పడుతున్నారని తెలిపారు. సైడ్ కాలువలు శుభ్రం చేయాలని, మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పలుమార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించినా స్పందన కరవైందని వార్డు వాసులు ఆరోపిస్తున్నారు. ప్రజల ఆరోగ్యంపై ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదని విమర్శిస్తున్నారు. ఎక్కడి చెత్త అక్కడే' అన్న నినాదం కాగితాలకే పరిమితమైందని, వాస్తవంలో అమలు కావడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. శుభ్రపరిచే సిబ్బంది కనిపించడం లేదని, చెత్త తరలించే వాహనాలు వారాల తరబడి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నగర కమిషనర్ స్పందించి 25వ వార్డులోని సైడ్ కాలువలను వెంటనే శుభ్రం చేయించి, మురుగు నీరు రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకుని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ఉన్నత లక్ష్యాల సాధనకు సీయూ గెట్ కీలకం

### : డీసీపీ అంకిత్ కుమార్ సాఖ్వార్






**నర్సంపేట, జనవరి 8 (జర్నలిస్ట్ వార్త):** నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో సీయూ గెట్ (సీయూఈటీ) ప్రవేశ పరీక్షపై అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ అధ్యక్షత వహించగా, వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ సాఖ్వార్, ఐపీఎస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఉన్న ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశానికి సీయూ గెట్ కీలకమని పేర్కొన్నారు. కఠోర శ్రమ, క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. కీ నోట్ స్పీకర్ డాక్టర్ బైరి సత్యనారాయణ 2026 సీయూ గెట్ పరీక్ష విధానం, సిలబస్, నోటిఫికేషన్ వివరాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారానికే ప్రజా బాట




**వర్ధన్నపేట/జనవరి8(జర్నలిస్ట్ వార్త):** ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలకు తక్షణ పరిష్కారం చూపడమే లక్ష్యంగా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రజా బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏఈ తరుణ్ తెలిపారు. వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద గ్రామంలో గురువారం నిర్వహించిన ప్రజా బాట కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏఈ తరుణ్ మాట్లాడుతూ విద్యుత్‌కు సంబంధించిన సమస్యల పరిష్కారానికి 1912 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. వోల్టేజ్ సమస్యలు, లూజ్ వైర్లు, విద్యుత్ సరఫరాలో అంతరాయం, బిల్లులు ఎక్కువగా లేదా తక్కువగా రావడం, ట్రాన్స్‌ఫార్మర్లలో లోపాలు, కరెంట్ వైర్లపై చెట్ల కొమ్మలు ఉండటం, ఇండ్లపై నుంచి వెళ్లే 11 కేవీ లైన్లు, రహదారులకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్థంభాల సమస్యలపై వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేందుకు ప్రజా బాట కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బేతి సాంబయ్య, ఉప సర్పంచ్ బొచ్చు జ్యోతి యాదగిరి, వార్డు సభ్యులు జోగుల అనూష సంపత్, బొంతల కుమార్, అందె వనిత కృష్ణమూర్తి, సంగినేని భీమరాజు, భాషబోయిన ప్రవీణ్, తుళ్ల శైలజ అనిల్, తుళ్ల శ్రీకాంత్, లైన్మెన్ లక్ష్మణ్, అసిస్టెంట్ లైన్మెన్ సుమన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## చలిలో వణికిన వృద్ధులకు రాజేష్ హాస్పిటల్ చేయూత





**హనుమకొండ బ్యూరో/ధర్మసాగర్, జనవరి8(జర్నలిస్ట్ వార్త)** చలికాలం ఉధృతంగా ఉన్న ఈ రోజుల్లో రాత్రులు గడపలేక వణికిపోతున్న నిరుపేద అనాధ వృద్ధులు, దిక్కులేని భిక్షగాళ్లకు రాజేష్ హాస్పిటల్ మానవతా స్పర్శను అందించింది. ధర్మసాగర్‌లోని రాజేష్ హాస్పిటల్ ఆధ్వర్యంలో, మేనేజింగ్ డాక్టర్ డాక్టర్ సాయి మహేష్ (దిడ్డి రాజేష్ కుమారుడు) నాయకత్వంలో హృదయాన్ని తాకే సేవా కార్యక్రమం నిర్వహించారు. దేవాలయాల ముందు, రైల్వే స్టేషన్ల వద్ద రాత్రివేళలు గడుపుతూ చలితో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న వృద్ధులను స్వయంగా కలిసి, వారి బాధను విని, చలికి తట్టుకునే దుప్పట్లను సుమారు 50 మందికి ఉచితంగా అందజేశారు. చలి తట్టుకోలేక వణికిపోతున్న వారి ముఖాల్లో దుప్పట్లు అందుకున్న క్షణంలో కనిపించిన ఆనందం ఈ కార్యక్రమానికి నిజమైన సార్థకతను చాటింది. ఈ సందర్భంగా డాక్టర్ సాయి మహేష్ మాట్లాడుతూ, “ఆసుపత్రిలో చికిత్సలకే పరిమితం కాకుండా, సమాజంలోని బాధితుల కష్టాలను పంచుకోవడమే మా లక్ష్యం. చలిలో ఒక్కరైనా కాస్త సుఖంగా నిద్రపోతే అదే మా సేవకు ప్రతిఫలం” అని తెలిపారు. రాజేష్ హాస్పిటల్ చేపట్టిన ఈ మానవతా కార్యక్రమం స్థానికుల మనసులను హత్తుకుంది. కష్టకాలంలో పేదల పక్కన నిలిచిన ఈ సేవా భావనకు గ్రామస్తులు, ప్రయాణికులు అభినందనలు తెలియజేశారు.

## సేవాభావంతోనే నిజమైన నాయకత్వం

### ధర్మసాగర్ జెడ్పీ బాలుర పాఠశాలలో విద్యార్థి కేబినెట్ ప్రమాణ స్వీకారం




**హనుమకొండ బ్యూరో**
**ధర్మసాగర్/జనవరి8(జర్నలిస్ట్ వార్త):** ధర్మసాగర్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు)లో విద్యార్థి కేబినెట్ ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సమక్షంలో నూతనంగా ఎన్నికైన విద్యార్థి నాయకులు క్రమశిక్షణ, బాధ్యత, నిజాయితీ, నాయకత్వ గుణాలతో విధులు నిర్వహిస్తామని ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ నైపుణ్యాలు, బాధ్యతాభావం పెంపొందించడమే లక్ష్యమని పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కె.బి. ధర్మ ప్రకాశ్ మాట్లాడుతూ, నాయకత్వం అనేది అధికారం కాదని, సేవాభావం మరియు ఆదర్శ ప్రవర్తనతోనే నిజమైన నాయకత్వం సాధ్యమని అన్నారు. విద్యార్థులు సమిష్టిగా పాఠశాల అభివృద్ధి, విద్యా ప్రగతికి తోడ్పడాలని సూచించారు. ఉపాధ్యాయులు నూతన కేబినెట్ సభ్యులను అభినందిస్తూ, సహ విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని కోరారు. పాఠశాల విలువలను గౌరవిస్తూ క్రమశిక్షణతో ముందుకు సాగుతామని విద్యార్థుల ప్రతిజ్ఞతో కార్యక్రమం ముగిసింది.

## త్రివేణి స్కూల్‌లో తల్లిదండ్రుల కోసం రంగోలి కైట్ మేకింగ్ పోటీలు

### -పండుగ వాతావరణం తలపించిన కార్యక్రమాలు





**సత్తుపల్లి/జనవరి8(జర్నలిస్ట్ వార్త):** త్రివేణి స్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లుల కోసం రంగోలి (ముగ్గుల) పోటీని, తండ్రుల కోసం కైట్ మేకింగ్ (గాలిపటాల తయారీ) పోటీని ఘనంగా నిర్వహించారు.

రంగోలి పోటీలో పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొని, తమ కళాత్మక ప్రతిభను అందమైన ముగ్గుల రూపంలో ప్రదర్శించారు. అలాగే తండ్రుల కోసం నిర్వహించిన కైట్ మేకింగ్ పోటీలో విద్యార్థుల తండ్రులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని, సృజనాత్మకమైన గాలిపటాలను తయారు చేశారు. ఈ కార్యక్రమాలతో పాఠశాల ప్రాంగణం ఆనందోత్సాహాలతో నిండిపోయింది.

ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. సారిత మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాలు తల్లిదండ్రులుఉపాఠశాల మధ్య అనుబంధాన్ని మరింత బలపరుస్తాయని, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. క్యాంపస్ ఇన్‌చార్జ్ వంశీ, అకడమిక్ ఇన్‌చార్జ్ పవన్, కిడ్స్ ఇన్‌చార్జ్ శ్రీ పద్మ మాట్లాడుతూ ఈ కార్యక్రమాలపై తమ అభిప్రాయాలను వెల్లడిస్తూ, తల్లిదండ్రుల పాల్గొనడం ప్రశంసనీయం అని అన్నారు. త్రివేణి స్కూల్ డైరెక్టర్ జి. వీరేంద్ర చౌదరి ఈ సందర్భంగా పాల్గొన్న తల్లిదండ్రులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఇలాంటి సాంస్కృతిక మరియు సృజనాత్మక కార్యక్రమాలు పాఠశాల కుటుంబాన్ని మరింత సమైక్యంగా మారుస్తాయని పేర్కొన్నారు. అలాగే, సీఆర్వో మురళీ కృష్ణ త్రివేణి టీమ్‌కు, రంగోలి, కైట్ మేకింగ్ పోటీల్లో పాల్గొన్న తల్లిదండ్రులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమాలు విజయవంతంగా ముగియడంతో పాల్గొన్న తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

## కట్ర్యాల శ్రీ మల్లికార్జున ఉత్సవ కమిటీ ఎన్నిక

### : గ్రామస్తుల ఐక్యతలో ఘన విజయం






**వర్ధన్నపేట/జనవరి 8(జర్నలిస్ట్ వార్త):** కట్ర్యాల గ్రామంలోని శ్రీ మల్లికార్జున స్వామి సంక్రాంతి బ్రహ్మోత్సవాల ఉత్సవ కమిటీ 2026 కోసం గ్రామస్తుల ఆధ్వర్యంలో ఎన్నిక చేయబడింది. కమిటీకి గౌరవ అధ్యక్షుడిగా గుజ్జ రవీందర్ రెడ్డి, అధ్యక్షుడిగా చేవ్వల్ల స్వామి, ఉపాధ్యక్షులుగా చెంగల చిరంజీవి, ముత్యాల సంజీవ నియమితులయ్యారు. డైరెక్టర్లుగా కృష్ణ, యాదగిరి, కుమార్ రాజా, ప్రశాంత్, అశోక్, దేవేందర్, వెంకన్న, ముత్యాల మల్లేశం, జంపాల మల్లేశం, లింగాలు తదితరులు ఎన్నుకున్నట్లు గ్రామ సర్పంచ్ రాయపురం రమ్య రాజు తెలిపారు. నెలకొన్న రాజకీయ సవాళ్లను ఎదుర్కొన్నప్పటికీ గ్రామస్తుల ఐక్యతతో కమిటీని సక్రమంగా ఏర్పాటుచేయడం గ్రామంలో ఆనందాన్ని రేకెత్తించిందని స్థానికులు పేర్కొన్నారు.



# వర్ధన్నపేటకు మళ్లీ జీవం

**అభివృద్ధి దిశగా కాంగ్రెస్ సర్కారు దూకుడు**

## కనీ విని ఎరుగని రీతిలో మార్పు తెస్తా

## హాస్పిటల్‌పై ఆందోళన అక్కర్లేదు: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్




















వంద పడకల ఆసుపత్రి కోసం స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు. మాజీ టెస్కాబ్ చైర్మన్ రవీందర్రావు లు



సన్న బియ్యం లబ్ధిదారుడు ఇంట్లో కూర్చుని భోజనం చేస్తున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్, వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

**వర్ధన్నపేట/జనవరి8(జర్నలిస్ట్ వార్త):**
ఏళ్ల తరబడి నిర్లక్ష్యానికి గురై, 'అభివృద్ధి' అనే మాటకే దూరంగా ఉన్న వర్ధన్నపేట నియోజకవర్గం ఇప్పుడు కొత్త దిశగా అడుగులు వేస్తోంది. గత పదిహేనేళ్ల పాలనలో మాటలు, హామీలకే పరిమితమైన రాజకీయాలకు ముగింపు పలుకుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వర్ధన్నపేటకు మళ్లీ జీవం పోసే ప్రయత్నాలు ఊపందుకున్నాయి. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్ నేతృత్వంలో ప్రారంభమైన అభివృద్ధి కార్యాచరణ ప్రజల్లో కొత్త ఆశలు రేకెత్తిస్తోంది.
వర్ధన్నపేటను కనీ విని ఎరుగని రీతిలో అభివృద్ధి చేస్తానన్న హామీ మాటలకే పరిమితం కాదని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్ స్పష్టం చేశారు. వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి అంశంపై ఎలాంటి ఆందోళన అవసరం లేదని, అన్ని ప్రక్రియలు పద్ధతిగా ముందుకెళ్తున్నాయని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా భూమి, నిధులు, పరిపాలనా అనుమతుల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయాలతో ముందుకు సాగుతోందని చెప్పారు.

### గత పాలనలో మాటలే మిగిలాయి

గత 15 ఏళ్లుగా వర్ధన్నపేటను పాలించిన పాలకుల పనితీరు ప్రజలకు తెలియనిది కాదని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. వర్ధన్నపేట పేరుమీద సాంక్షన్ పొందిన అనేక అభివృద్ధి ప్రాజెక్టులు క్షేత్రస్థాయిలో అమలుకాక, వరంగల్‌ఉహనుమకొండ పట్టణ కేంద్రాలకే పరిమితమయ్యాయన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.కోనారెడ్డి చెరువులో ఏర్పాటు చేయాల్సిన మినీ ట్యాంక్‌బండ్ హసన్పర్తి మండలానికి తరలిపోవడం ఇందుకు నిదర్శనంగా స్థానికులు పేర్కొంటున్నారు. అలాగే ఇంటర్, డిగ్రీ, బీసీ, ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్స్, గురుకులాలు హనుమకొండ పట్టణానికే పరిమితమవ్వడం వల్ల వర్ధన్నపేట యువతకు తీవ్ర అన్యాయం జరిగిందని విమర్శలు ఉన్నాయి. ఇరిగేషన్, పంచాయతీరాజ్, హార్టికల్చర్ తదితర శాఖల కార్యాలయాలు నేటికీ వరంగల్‌ఉహనుమకొండకే పరిమితమై ఉండటంతో నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడ్డదన్న భావన ప్రజల్లో బలంగా నెలకొంది.

### ప్రజాపాలనలో కొత్త దిశ

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వర్ధన్నపేట అభివృద్ధిని ప్రాధాన్యంగా తీసుకుని కార్యాచరణ ప్రారంభించింది. ఆధారాలతో, యుక్తంగా సాంక్షన్లు సాధిస్తూ



ముందుకు సాగుతున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు.

### వర్ధన్నపేటకు సాంక్షన్ అయిన ప్రధాన అభివృద్ధి పనులు

ఇంటిగ్రేటెడ్ స్కూల్, మినీ కోర్టు, మినీ జైలు, ఆర్‌డీఓ కార్యాలయం, వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి, ఈ ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో అమలైతే వర్ధన్నపేట పరిపాలనా, విద్యా, వైద్య కేంద్రంగా రూపాంతరం చెందనుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

### ప్రజల్లో నమ్మకం రాజకీయాల్లో చర్చ..

పోలీస్ అధికారిగా క్రమశిక్షణ, నిబద్ధతతో సేవలందించిన కేఆర్ నాగరాజ్, రాజకీయ నాయకుడిగానూ అదే ధోరణిని కొనసాగిస్తున్నారని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, అధికార యంత్రాంగాన్ని కదిలిస్తూ నిర్ణయాలు తీసుకోవడం వల్ల అభివృద్ధి పనులు ఒక్కొక్కటిగా ముందుకు సాగుతున్నాయని చెబుతున్నారు.మునుపెన్నడూ లేని విధంగా వర్ధన్నపేటలో అభివృద్ధి పనులు ప్రజల కళ్లముందే కనిపిస్తున్నాయని, ఇది రాబోయే రాజకీయాల్లో కీలక ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. గత నిర్లక్ష్యానికి చెల్లింపులా, ప్రస్తుత ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు వర్ధన్నపేట భవిష్యత్తును కొత్త మలుపు తిప్పుతున్నాయని ప్రజలు భావిస్తున్నారు.





ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు చిన్నూరి అనిల్ కుమార్ శర్మ తండ్రి రాజేశ్వరరావును హాస్పటల్లో పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నాగరాజ్ ,సీనియర్ అడ్వకేట్ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు శేఖర్ రావు లు



ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం ప్రజా తో కలిసి స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు



మహిళా సంఘాలకు చెక్ అందిస్తున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్

## మోహన్ రావు చిత్రపటానికి పూలమాలు వేసిన వీరారెడ్డి



**తల్లాడ జనవరి8(జర్నలిస్ట్ వార్త);**తల్లాడ మండలం గొల్లగూడెం గ్రామంలో సన్నిధానం మోహనరావు కి చిత్రపటానికి వైరా మాజీ వ్యవసాయ పూలమాలు వేసి నివాళులర్పించారు.మార్కెట్ చైర్మన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు దుండేటి వీరారెడ్డి కుటుంబ సభ్యులు పద్మాచారి అశోక్ చారి వార్డు మెంబర్ ఇ వెంకటేశ్వర్లు బి ముత్తారెడ్డి బీ మల్లారెడ్డి టీ పాపారావు టీ బాలకృష్ణ వెంకటేశ్వర్లు టి వెంకటేశ్వర్లు బి తిరుపతిరావు చల్లా నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## పూజల మోసం

### : ధర్మసాగర్ పోలీసులు నిందితుడిని అరెస్ట్,

### రెండు లక్షల బంగారం స్వాధీనం



**హనుమకొండ బ్యూరో/ధర్మసాగర్, జనవరి8(జర్నలిస్ట్ వార్త):** పూజల పేరుతో ప్రజల నుంచి అధిక డబ్బులు వసూలు చేసిన కేసులో, కల్పేష్ మంగేష్ కమాడిని ధర్మసాగర్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. అతని వద్ద సుమారు రెండు లక్షల విలువ గల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.నిందితుడి తండ్రి పేరు మంగేష్, నివాసం రాజా గ్రామం, పనువెల్ తాలూకా, రాయగడ జిల్లా, మహారాష్ట్ర అని పోలీసులు తెలిపారు.హనుమకొండ జిల్లా ధర్మసాగర్ ఎస్‌హెచ్‌ఓ శ్రీధర్ రావు వివరాల ప్రకారం, "నిందితుడు పూజల పేరుతో మోసపూరిత వ్యాపారం నిర్వహించేవాడని గుర్తించాం. అతన్ని రిమాండ్ కోసం కోర్టుకు హాజరుపరిచాం. మరిన్ని దర్యాప్తులు కొనసాగుతున్నాయి" అన్నారు.పోలీసుల వివరాల ప్రకారం, నిందితుడి కార్యకలాపాలపై పూర్తి విచారణ జరుపుతున్నట్లు, ఇతర నిందితులను గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## సర్పంచ్ ను సన్మానించిన శ్రీకృష్ణ హాస్పిటల్ డైరెక్టర్స్




**రాయపర్తి/డిసెంబర్ 8(జర్నలిస్ట్ వార్త):**రాయపర్తి గ్రామ సర్పంచ్ గా నూతనంగా ఎన్నికైన గారే సహేంద్రబిక్షపతి ని గురువారం హన్మకొండ శ్రీ కృష్ణ పిల్లల హాస్పిటల్ మానేజీశీగ్ డైరెక్టర్ డాక్టర్ శేషు మాధవ్,డాక్టర్స్ రాజ్ కుమార్,కమ్రాన్, గారె కరుణాకర్ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## వర్ధన్నపేటలో 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి ఏర్పాటు కోసం స్థల పరిశీలన



**వర్ధన్నపేట/జనవరి8 (జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి ఏర్పాటు కోసం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి నగరంలోని స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, టౌన్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ వర్ధన్నపేట ప్రజలకు సమీపంలో నాణ్యమైన వైద్య సేవలు అందించడమే మా ప్రధాన లక్ష్యం. ఈ ఆస్పత్రి ద్వారా వర్ధన్నపేటతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు సౌకర్యవంతమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. పేద, మధ్యతరగతి ప్రజలు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్ళాల్సిన ఇబ్బందులు తగ్గుతాయి. ఆస్పత్రి త్వరలో మంజూరు అయ్యేలా రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ ముందుకు వెళ్తున్నాం. ప్రజల ఆరోగ్యం మా ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత" అని తెలిపారు. వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఒక ముందడుగు పడినట్లే అవుతుందని మున్సిపల్ ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

## ఛత్రపతి శివాజీ విగ్రహనికి నిప్పంటించిన దుండగులను శిక్షించకుంటే ఆమరణ దీక్ష చేస్తాం



**రాయపర్తి/జనవరి 8(జర్నలిస్ట్ వార్త):**ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహానికి నిప్పంటించిన దుండగులను ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.మండలం బంధన పల్లి గ్రామంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహనికి ఇటీవల కొంత మంది దుండగులు నిప్పు అంటించగా కొంత మేర కాలిపోయింది.ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహాన్ని గురువారం ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ ఛైర్మెన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి సందర్శించి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్ ఒక గొప్ప భారతీయ యోధుడు, మరాఠా సామ్రాజ్య స్థాపకుడు అన్నారు.పశ్చిమ భారతదేశంలో స్వతంత్ర రాజ్య స్థాపనకై పోరాడిన యుద్ధ వ్యూహ నిపుణుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ అన్నారు.అలాంటి మహనీయుని విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను గుర్తించకపోవడం బాధాకరం అన్నారు.ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను వారం రోజుల్లో పట్టుకొని శిక్షించాలని లేని పక్షంలో ఆమరణ నిరాహార దీక్ష కు సిద్ధమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రంగు కుమార్ గౌడ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు భూక్య సురేందర్ రాథోడ్,లేతాకుల రంగారెడ్డి,ఐత రాంచందర్, చిలువేరు సాయి గౌడ్, భూక్య వాలు నాయక్,. భూక్య దీప్లా నాయక్, సంకినేని ఎల్ల స్వామి, చందు సతీష్, గారే నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## సిసిఐ జాతీయ శతవార్షికోత్సవ ముగింపు ఉత్సవాలను జయప్రదం చేయండి.

### -సిపిఐ రాష్టసమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్.



**వేలేరు/జనవరి8(జర్నలిస్ట్ వార్త):** ఈనెల 18 న ఖమ్మంలో జరుగు సిపిఐ జాతీయ శతజయంతి ఉత్సవాల ముగింపును జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్రసమితి సభ్యులు ఆదరిని శ్రీనివాస్ కోరారు. గురువారం హనుమకొండ జిల్లా వేలేరు మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సిపిఐ మండల కార్యదర్శి గడ్డమీది శంకరయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅథిధిగా హాజరై వాల్ పోస్టురు ఆవిష్కరించి మాట్లాడారు. సిపిఐ పార్టీ ఆవిర్భవించి సమకాలీన, రాజకీయ పరిస్థితులు, మతోన్మాద ప్రమాదం, పెరుగుతున్నఆర్థిక అసమానతలు, కార్మిక కర్షక, తదితర విషయాల గూర్చి అనేక పోరాటాలు చేసి చరిత్రలో నిలిచిపోయి 100 సంవత్సరాల సంధర్భంగా శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయుటకు వేలేరు మండలం నుండి అధిక సంఖ్యలో హాజరై విజవంతం చేయాలని మండల ప్రజలకు పిలుపునిచ్చారు. ఈసందర్భగా శ్రీనివాస్ మాట్లాడుతూ వందేల్ల సిపిఐ సమశీల రపోరాటాల చరిత్రను నేటితరానికి తెలియజేయడంతోపాటు సమకాలీన రాజకీయ పరిస్థితులు, మతోన్మాదప్రమాదంపెరుగుతూ, ఆర్థిక అసమానతలు తదితర విషయాలను నేటితరానికి తెలియజేసి భవిష్యత్ పోరాటాలకు కార్యోన్ ముఖులను చేసేందుకు ఈసభ దోహదపడుతోందని అన్నారు. ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బిజిఎన్ఆర్ కళాశాల మైదానంలో జరిగే ఈసభకు మండలం నుండి అధ్యకంగా తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్టసమితి సభ్యులు ఆదరి శ్రీనివాన్, సిపిఐ మండల కార్యదర్శి గడ్డమీది శంకరయ్య, జిల్లాసమితి సభ్యులు మేకల శంకరయ్య పాల్గొన్నారు.

## సేవలోనూ సాటిలేని నాయకుడు

### కందాళ ఉపేంద్ర రెడ్డి 65వ పుట్టినరోజు

### : తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరం ఘనంగా







**పాలేరు/జనవరి8(జర్నలిస్ట్ వార్త):** ప్రజాసేవకు ప్రతీకగా నిలిచే పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేంద్ర రెడ్డి తన 65వ పుట్టినరోజును ప్రత్యేకంగా సేవా కార్యక్రమాలతో ప్రారంభించారు. 'కందాళ యూత్' ఆధ్వర్యంలో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.రక్తదాన శిబిరాన్ని స్వయంగా ప్రారంభించిన ఉపేంద్ర రెడ్డి మాట్లాడుతూ, "ఆడంబరాల కంటే ఆపదలో ఉన్న వారికి సాయం చేయడంలోనే నిజమైన తృప్తి ఉంది. తలసేమియా చిన్నారుల ప్రాణాలను కాపాడేందుకు యువత ముందుకు రావడం అభినందనీయం" అని అన్నారు.గ్రామస్థులు, విద్యార్థులు, యువత, సామాజిక కార్యకర్తలు భారీగా పాల్గొని కార్యక్రమాన్ని ఘనంగా చేర్చారు. ఉపేంద్ర రెడ్డి సేవా దృక్పథంతో ముందుకు సాగుతున్న కందాళ యూత్ టీమ్కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు





**తల్లాడ/జనవరి8(జర్నలిస్ట్ వార్త):** మండల పరిధిలోఇటీవల కాలంలో లక్ష్మీపురం గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన శీలం చిన్న రామిరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన ఈ కార్యక్రమంలో తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాపా సుధాకర్,జక్కంపూడి కిషోర్, పోట్రు శరత్ బాబు, ముత్తరెడ్డి,, సొసైటీ డైరెక్టర్ గోవింద్ శ్రీను, లక్ష్మీపురం గ్రామ ఉప సర్పంచ్ బండి బాలశౌరి, బలరాం,శీలం మల్లారెడ్డి, షేక్ మీర్జా, కృష్ణయ్య, సోషల్ మీడియా కోఆర్డినేటర్ షేక్ జమాల్, వెంకటేశ్వర్లు, వెంకటేష్, నాగేశ్వరావు,తదితరులు ఈ కార్యక్రమాలలో పాల్గొన్నారు.

## కేటీఆర్ వ్యాఖ్యలపై యూత్ కాంగ్రెస్ ఆగ్రహం



**వర్ధన్నపేట/జనవరి 8 (జర్నలిస్టు వార్త):**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇటీవల కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై చేసిన హౌలా వ్యాఖ్యలను వర్ధన్నపేట యువజన కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకించింది.యువజన కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ కుల్ల యకాంతం మాట్లాడుతూ, "రాహుల్ గాంధీ కుటుంబం త్యాగాల కుటుంబం. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఓ ఐపీఎస్ అధికారిని బూతులు తిట్టారని, ఇప్పుడు అదే వ్యక్తి హౌలా అని సంబోధించడం సరిగ్గా లేదు. కేటీఆర్‌కు సిగ్గు, శరం లేదని, ఆయన బ్రోకర్, లఫూట్‌గాడని తిట్టలేమా? రాహుల్ గాంధీకి క్షమాపణ చెప్పే వరకు కేటీఆర్‌ను వదలమని ఖచ్చితంగా చెబుతున్నాం" అని హెచ్చరించారు.కుల్ల యకాంతం కేటీఆర్‌ను సభ్యత లేకుండా మాట్లాడినందుకు విమర్శిస్తూ, భవిష్యత్తులో రాష్ట్రంలో ఎక్కడకూడా కేటీఆర్‌ను తిరగనివ్వబోమని, నిరసనలో పాల్గొనేవారికి పెద్ద ఎత్తున యూనిఫాం ఇచ్చి, పార్టీ శ్రేణులతో సత్తా చాటాలని కార్యకర్తలను పిలుపునిచ్చారు.

## దివ్యాంగుల అభ్యున్నతికి పటిష్ట కార్యాచరణ అమలు..

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి -అర్హులైన దివ్యాంగులకు పారదర్శకంగా సదరం సర్టిఫికెట్ జారీ

### బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీకి కట్టుదిట్టమైన చర్యలుఅంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్






**ఖమ్మం బ్యూరో/జనవరి 8(జర్నలిస్ట్ వార్త):** జిల్లాలో దివ్యాంగుల అభ్యున్నతికి పటిష్ట కార్యాచరణ అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్ లో నిర్వహించిన వేడుకల్లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల కారణంగా నెలరోజులు ఆలస్యంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నామని అన్నారు. దివ్యాంగుల సంక్షేమ కార్యక్రమాల అమలులో ఖమ్మం జిల్లా యంత్రాంగం ముందంజలో ఉంటుందని అన్నారు. దివ్యాంగుల వివాహ ప్రోత్సాహకం సంబంధించి ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, జిల్లాలో దరఖాస్తు చేసుకున్న అర్హులైన దివ్యాంగ జంటలకు సంబంధిత వివాహ ప్రోత్సాహకం త్వరగా అందేలా చూడాలని అన్నారు. స్కాలర్ షిప్, దివ్యాంగులకు అవసరమైన పరికరాల పంపిణీలో లేవనెత్తిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అర్హులైన దివ్యాంగులందరికి పారదర్శకంగా సదరం సర్టిఫికెట్ అందించేలా చర్యలు తీసుకున్నామని, అర్హులకు అందేలా సదరం సర్టిఫికెట్ జారీ అంశాన్ని ర్యాండంగా చెక్ చేస్తామని అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో కంటి చూపు సమస్య వల్ల బిడ్డను పాఠశాలకు పంపడం లేదని ఒక దరఖాస్తు వచ్చిందని, ఖమ్మం జిల్లాలో కంటిచూపు సమస్య ఉన్న పిల్లల కోసం ప్రత్యేకంగా పాఠశాల ఏర్పాటుకు చర్యలు చేపట్టామని, త్వరలోనే దీనిని ప్రారంభిస్తామని కలెక్టర్ తెలిపారు. వీధి వ్యాపారాల్లో దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలకు ఆదేశాలు జారీ చేశామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులలో దివ్యాంగులకు 5 శాతం అమలు అయ్యేలా చర్యలు చేపట్టామని అన్నారు. దివ్యాంగులకు ఆత్మ గౌరవ భవనం మంత్రి అనుమతితో త్వరలో భూ కేటాయింపులు చేస్తామని అన్నారు. నూతన మీ-సేవా కేంద్రాల ఏర్పాటులో దివ్యాంగులకు 5 శాతం అందేలా చూస్తామని, కేంద్ర ప్రభుత్వం అమలు చేసే వివిధ పథకాలను కూడా పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా కార్యాచరణ సిద్ధం చేయాలని అన్నారు. హైదరాబాద్ కలెక్టర్ గా పని చేస్తున్న సమయంలో తాను బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేశానని అన్నారు. ఖమ్మం జిల్లాలో కూడా నిబంధనల ప్రకారం బ్యాక్ లాగ్ పోస్టులు పారదర్శకంగా భర్తీ చేసేందుకు త్వరలోనే చర్యలు తీసుకుంటామని అన్నారు. దివ్యాంగ క్రీడా పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కలెక్టర్ అభినందనలు తెలిపారు.దివ్యాంగ ఉద్యోగుల సంఘం ప్రతినిదులు మాట్లాడుతూ దివ్యాంగుల కోసం ఆత్మ గౌరవం భవనం కేటాయింపు చేయాలని అన్నారు. దివ్యాంగులకు రవాణా నిమిత్తం వాహనాల రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్ జారీ లో సమస్యలు రాకుండా చూడాలని కోరారు. విద్యా శాఖలో నూతనంగా ప్రారంభించిన ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం అద్భుతంగా పని చేస్తుందని, దీనిని అద్భుతంగా రూపొందించినందుకు జిల్లా కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లా స్థాయి ఆటల పోటీలలో పాల్గొని మొదటి, రెండవ స్థానంలో నిలిచిన దివ్యాంగులకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేసి దివ్యాంగులతో కలిసి జిల్లా కలెక్టర్ కేక్ కట్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి విజేత, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ. డా. వేణుమాధవ్, డి.హెచ్.ఈ.డబ్ల్యూ సమ్రీన్, దివ్యాంగ సంఘ ప్రతినిధులు, స్వచ్ఛంధ సంఘ సభ్యులు, దివ్యాంగులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ వార్త

శుక్రవారం09 జనవరి 2026

## రామకోటమ్మకు నివాళులర్పించిన నాయకులు



**తల్లాడ/జనవరి8(జర్నలిస్ట్ వార్త):** మండల పరిధిలోలక్ష్మీపురం గ్రామంలో మాజీ సర్పంచ్ సీతారామ రెడ్డి కుటుంబన్ని పరామర్శించిన వైరా వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ మరియు కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకులు దుండేటి వీరారెడ్డి ఇటీవల కాలంలో లక్ష్మీపురం గ్రామంలో మాజీ సర్పంచ్ సీతారామరెడ్డి అమ్మగారైన రామకోటమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి



కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన దుండేటి వీరారెడ్డి ఏమిరెడ్డి కృష్ణారెడ్డి మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ ధూపాటి భద్రరాజు,లక్ష్మీపురం వారి ఇంటికి వెళ్ళి రామకోటమ్మ చిత్ర పటానికి పూల మశీలం.ముత్త రెడ్డి, శీలం.శ్రీనివాస రెడ్డి,ఎక్కిరాల. సుదర్శన్,నాగార్జున రెడ్డి శ్రీనివాస్ రెడ్డి బహుదూర్ పాల్గొన్నారు.

## మేఘన ఉమెన్ వెల్ఫేర్ సొసైటీ చేయూత

### ఆర్థిక సాయం అందించిన సొసైటీ అధ్యక్షులు సుహాసిని





**భీమదేవరపల్లి/జనవరి8 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో అనారోగ్యానికి గురైన పలువురికి మేఘన ఉమెన్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు సుహాసిని గురువారం ఆర్థిక సాయంతో పాటుగా పండ్లు కోడి గృడ్లుఅందించారు. వంగర గ్రామంలో అనారోగ్యానికి గురైన రజనీకాంత్ కుమారుడు చింటూ కు రూ.20 వేలు, మల్లమారి శ్రీనివాస్ కు రూ.10వేలు బత్తినీ రాజయ్య కు రూ.2500, రోడ్డ కొమురమ్మ కి రూ. 2500 అందించినట్లు సుహాసిని తెలిపారు. ఈ సందర్భంగా మేఘన ఉమెన్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు సుహాసిని మాట్లాడుతూ పేదకుటుంబాలకు చెందిన వారు అనారోగ్యానికి గురి కావడంతో వారికి కాసింత అండగా నిలవలనే ఉద్దేశంతో తమ సొసైటీ ఆధ్వర్యంలో వారికి వైద్య ఖర్చులతో పాటుగా పండ్లు అందించినట్లు తెలిపారు. తమ సొసైటీ ఆధ్వర్యంలో మరిన్ని కార్యక్రమాలు చేస్తామని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్వరూప, రజిత, స్వప్న పాల్గొన్నారు.

## గార్ల ,బయ్యారం సీఐ బదిలీ..!

### నూతన గుండాల మండలం సీఐగా రవీందర్.



**బయ్యారం/జనవరి8(జర్నలిస్ట్ వార్త);** గార్ల ,బయ్యారం సర్కిల్ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న భూక్యా రవికుమార్ బదిలీ వేటు పడినట్లు సమాచారం ఆ స్థానంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల సీఐగా విధులు నిర్వహిస్తున్న రవీందర్ యాదవ్ బాధ్యతలు చేపట్టనునట్లు సమాచారం. దీనిపై గుండాల సీఐ రవీందర్ వివరణ కోరగా బయ్యారం సిఐగా బదిలీపై వస్తున్నట్లు తెలిపారు.



## బీసీ విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలి.

### -ఘనపూర్ డివిజన్ అధ్యక్షుడు అన్వర్ పాషా



**స్టేషన్ ఘన్ పూర్/జనవరి8 (జర్నలిస్ట్ వార్త);**వరంగల్ నగరంలోని ఉర్సుగుట్ట ప్రాంతం ఆకుతో ట కన్వెన్షన్ హాల్ లో నేడు మధ్యాహ్నం 2 గంట లకు రాష్ట్ర బీసీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న20వ రాష్ట్ర మహాసభ లో స్టేషన్ ఘనపూర్ డివిజన్ బీసీ విద్యుత్ ఉద్యోగులు అత్యధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఘనపూ ర్ డివిజన్ అధ్యక్షుడు మొహమ్మద్ అన్వర్ పాషా కోరారు. గురువారం ఘనపూర్ సబ్ డివిజన్ కార్యాలయం ఆవరణలో బీసీ మహాసభ గోడపత్రి కను డివిజన్ కార్యవర్గ సభ్యులతో కలిసి ఆవిష్క రించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్ర వారం వరంగల్ నగరంలోని ఉర్సుగుట్ట (ఆకుతో ట కన్వెన్షన్ హాల్) లో జరిగే బీసీ మహాసభలో 2026సంవత్సర బీసీ డైరీ, క్యాలెండర్ ఆవిష్కర ణ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ నాయకులతో పాటు ముఖ్య అతిథులుగా అతిరథ మహారథులు పాల్గొంటున్న ఈసభకు ప్రతీ బీసీ ఉద్యోగి పాల్గొని బీసీల ఐక్యత చాటాలని కోరారు. ఈ కార్యక్రమం లో జిల్లా అధ్యక్షులు జి రాంబాబు,కోశాధికారి పగిడిమంతల శంకర్,డివిజన్ కార్యదర్శి వాసం శ్రీధర్,కార్యనిర్వాహకఅధ్యక్షుడు పన్నీరు సందీప్, ఉపాధ్యక్షుడు సాంబరాజు,అల్లావుల రాము, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాటశాలల్లో నే విద్యార్థులకు నాణ్యమైన విద్య

### - ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మెన్ శ్రీనివాస్ రెడ్డి







**రాయపర్తి/జనవరి 8(జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పెరికేడు, జగన్నాధపల్లి, దుబ్బ తండా, సన్నూరు, గన్నారం,కేశపురం,తేట్టేకుంట గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టై,బెల్ట్, టీషర్టు,షూ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద,ధనిక భేదం చూపించకుండా అందరూ సమానమే అని అన్నారు.కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కూడా ఒకే యూనిఫామ్ ఉండాలనే ఉద్దేశంతో టీషర్టు,టై,బెల్ట్ లను అందజేయడం జరుగుతుందని అన్నారు.దీనితో విద్యార్థుల్లో అందరూ సమానమే అనే భావం నెలకొంటుందని అన్నారు.ఈ కార్యక్రమశీలో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి,మాజి జెడ్పీటిసి మాజీ రంగు కుమార్ గౌడ్,బిఆర్ఎస్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షుడు భూక్య సురేందర్ రాథోడ్, మండల నాయకులు లేతాకుల రంగారెడ్డి,గజవెల్లి ప్రసాద్,ఐత రాంచందర్, చిలువేరు సాయి గౌడ్, సంకినేని ఎల్ల స్వామి,గారే నరేష్, చందు సతీష్,రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి సహకారంతో వీరన్న ఆలయ అభివృద్ధి

### -బిజెపి మండల అధ్యక్షులు శ్రీరామోజు శ్రీనివాస్



**భీమదేవరపల్లి/జనవరి (జర్నలిస్ట్ వార్త):** ఉత్తర తెలంగాణలో ప్రసిద్ధి చెందిన కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి జాతర సందర్బంగా రోడ్డు మరమ్మతులకు చేపట్టినట్లు బిజెపి మండల అధ్యక్షులు శ్రీరామోజు శ్రీనివాస్ తెలిపారు. గురువారం భీమదేవరపల్లి మండలం కొత్తకొండలో ఆయన విలేకర్లతో



మాట్లాడుతూ.. దేవస్థానం కార్యనిర్వహణాధికారి కిషన్ రావు అడిగిన వెంటనే కేంద్ర హోంశాఖ సహాయక మంత్రి బండి సంజయ్ స్వంత నిధులతో రోడ్డు మరమ్మత్తులు చేయించారని తెలిపారు. వీటితో పాటు 2 హైమాక్స్ లైట్లు, 2 బోర్లు మంజూరు చేసారని చెప్పారు. బడ్జెట్ ప్రకారంగా కొత్తకొండ గ్రామానికి రూ30 లక్షలు అభివృద్ధి పనులు చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. శ్రీ వీరభద్రస్వామి దేవస్థానానికి అభివృద్ధికి ఏలాంటి సహకారం కావాలన్నా చేస్తామని చెప్పారని అన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా కౌన్సిల్ మెంబర్ పైడిపెల్లి పృథ్విరాజ్ గౌడ్. ఎర్రంచెట్టి ఉపేందర్. కంకల సదానందం. పయ్యావుల రాజు.జనగాని కుమరస్వామి జుర్రు అఖిల్. తదితరులు పాల్గొన్నారు.

## ముల్కనూర్ శివారులో

## కుళ్ళిన మృతదేహం కలకలం

**భీమదేవరపల్లి/జనవరి8 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామ శివారులో గుర్తుతెలియని మగ వ్యక్తి శవం స్థానికంగా కలకలం రేపింది. ముల్కనూర్ ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం సుమారు 30 నుంచి 40 సంవత్సరాల వయసు గల శవం సమ్మక్క గుట్టవద్ద ఉందన్న సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహం ఎడమవైపు ఛాతీపై ఇంగ్లీషులో అమ్మ అనే పచ్చబొట్టు కలిగి ఉందని చెప్పారు. నలుపు రంగు జీన్ పాయింట్ తెల్లని, పింక్ కలర్, ఫుల్ హాండ్స్ చొక్క వేసుకొని ఉన్నట్లు తెలిపారు. శవం బాగా కూలిన స్థితిలో గుర్తుపట్టడానికి వీలు లేకుండా ఉందన్నారు. గుర్తు తెలియని శవం వివరాలు ఎవరికైనా తెలియజేస్తే ముల్కనూరు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.



## వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



**తల్లాడ/జనవరి8(జర్నలిస్ట్ వార్త):**స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. తల్లాడ మండలం మిట్టపల్లి అంబేద్కర్ నగర్ కాలనీలో స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు వరకా రామారావు అంబటిపూడి శ్రీను ఉప సర్పంచ్ ఆధ్వర్యంలో 75 రగ్గులు పంపిణీ చేయడం జరిగింది. ఫౌండేషన్ వారు వృద్ధులకు చలికాలంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్నందుకు ఫౌండేషన్ చైర్మన్ శ్రీవ్యాల్ కి, ధాతలకు,వరకా రామారావు కి గ్రామ ప్రజల ప్రత్యేక ధన్యవాదములు తెలుపారు, అనంతరం గ్రామ పెద్దలు రామారావు ని పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కొండా దర్గయ్య,బూరుగు చార్లెస్, అంబటిపుడి కిషోర్, కొండా గోపినాథ్, అభిరామ్, ఫౌండేషన్ వాలంటీర్లు ఉబ్బన బాబురావు, జల్ది రామకృష్ణ వేము దినకర్, మర్రెల వెంకటేశ్వరావు,ముజీమ్ పాల్గొన్నారు.

## వికలాంగులకు విశ్వశాంతి అన్నదానం



**సత్తుపల్లి/జనవరి8(జర్నలిస్ట్ వార్త):** విశ్వశాంతి విద్యాలయం ఆధ్వర్యంలో సత్తుపల్లిలో వృద్ధులు, వికలాంగులకు అన్నదానం చేశారు. పండ్లు పంచిపెట్టారు. సిద్దారం రోడ్లో గల స్వర్ణిక వృద్ధులు, దివ్యంగుల ఆశ్రమం లో అన్నదానం చేశారు. దివ్యాంగులకు పండ్లు పంచిపెట్టారు.ఈ కార్యక్రమం లో సత్తుపల్లి లైన్స్ క్లబ్ అధ్యక్షుడు గోగడ రమేష్, లైన్స్ క్లబ్ గ్లోబల్ ఎక్స్టెన్షన్ టీం కోఆర్డినేటర్ మందపాటి ప్రభాకర్ రెడ్డి ,విశ్వశాంతి విద్యాలయం యాజమాన్యం పసుపులేటి నాగేశ్వర రావు, నరుకుల్ల కుళ్ళ సత్యనారాయణ, ఆశ్రమం నిర్వాహకులు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవో ,తాసిల్దార్ ను మర్యాదపూర్వకంగా కలిసిన తల్లాడ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు



**తల్లాడ/జనవరి8(జర్నలిస్ట్ వార్త):**తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ ఎన్నికైన నూతన సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు (చిన్నబ్బాయి)ఉపసర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి వారు గురువారం తల్లాడ తాసిల్దార్ కర్ణాకర్ రెడ్డి ఎంపీడీవో సురేష్ బాబు ల ను మర్యాదపూర్వకంగా కలుసుకొని స్వీటు అందించి, శాలువా కప్పి సన్మానించారు.. ఈ కార్యక్రమంలో ఎండి బాబు సర్పంచ్ కుమారుడు తదితరులు ఉన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలోరింగ్ రోడ్డు సెంటర్ నందు అల్పాహారం వితరణ



**తల్లాడ/జనవరి8(జర్నలిస్ట్ వార్త);**తల్లాడ లయన్స్ క్లబ్ అధ్యక్షులు కోడూరు నాగేశ్వరరావుఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఏపీ సింగ్ జన్మదినోత్సవం గురువారం సందర్భంగా తల్లాడరింగ్ రోడ్డు సెంటర్ నందు అన్నప్రసాదం వితరణ కార్యక్రమంలో అధ్యక్షులు , డిస్టిక్ జాయింట్ సెక్రెటరీదారా శ్రీనివాసరావు , మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఏపీ సింగ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని అంగర్ రిలీఫ్ వీక్ గా ప్రకటించి ఈ వారం రోజులు ప్రతిరోజు అన్న ప్రసాదం వితరణ చేయాలని నిర్ణయించమ్మనారు. అందులో భాగంగా రింగ్ రోడ్డు సెంటర్ నందు పాదచారులకు అల్పాహారం వితరణ . లయన్ సభ్యులు జి బాలకృష్ణ స్పాన్సర్ చేసినారు వారికి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేస్తున్నాము అన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ నంబూరు కనకదుర్గ ప్రసాద్, ట్రెజరర్ అనుమోలు సర్వేశ్వరరావు మాజీ సెక్రటరీ కటికి వెంకటేశ్వరరావు , మాజీ ట్రెజరర్ శీలం వెంకట్ రెడ్డి, తోట మురళి తదితరులు పాల్గొన్నారు.